

మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ఎమ్మెల్సీ సన్నాహక సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

# ఎమ్మెల్సీ మనదే

## బీఆర్ఎస్‌వైపే యువత

- కాంగ్రెస్ మోసాలను పట్టభద్రులకు వివరించాలి
- ఆ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే గులాబీ పార్టీకి మద్దతివ్వాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

వరంగల్, మే 15(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎమ్మెల్సీ ఎన్నికలో గెలుపు మనదేనని, యువత బీఆర్ఎస్ వైపే ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నికలపై బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన మూడు ఉమ్మడి జిల్లాల బీఆర్ఎస్ నాయకుల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఉద్యోగాల కల్పనపై కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేస్తున్నదని, గ్రాడ్యుయేట్స్ ఎన్నికలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించిన ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినట్లుగా చెప్పుకుంటున్నదని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటే గ్రాడ్యుయేట్లు బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్‌కు గెలుపు అవకాశాలు ఉన్నాయని, కాంగ్రెస్ పాలనలో వైఫల్యాలను గ్రాడ్యుయేట్లకు వివరించాలని సూచించారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో మొదటి నుంచి బీఆర్ఎస్‌కు ఆదరణ ఉన్నదని అన్నారు.

ఈ సెగ్మెంట్‌లో జరిగిన ప్రతి ఎన్నికలోనూ గులాబీ పార్టీ అభ్యర్థులే గెలిచారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తోనే యువతకు మేలు జరుగుతుందని, ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్‌పై ఒత్తిడి తెచ్చేందుకు భారత రాష్ట్ర సమితిని గెలిపించాలని ఓటర్లకు వివరించాలని కేటీఆర్ సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, సిరికొండ మధుసూదనాచారి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల జడ్పీ అధ్యక్షులు మారెపల్లి సుధీర్‌కుమార్, అంగోతు బిందు, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, బానోత్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఉపఎన్నికకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం

## రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన





సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ హరిచందన

నీలగిరి, మే15 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉపఎన్నికకు సంబంధించి బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణపై అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ నుంచి ఆమె పాల్గొని ఎన్నికల నిర్వహణపై అధికారులకు వివరించారు. శాసన మండలి ఉప ఎన్నిక నిర్వహణకు సరిపడా బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని, ఎన్నికల కోడ్ ఉల్లంఘన, అనుమతులు, ఎన్నికల ప్రచారం, ఎన్నికల ర్యాలీలు, అభ్యర్థులు పాటించాల్సిన నియమాలు, పాటించకూడని అంశాలపై అభ్యర్థులకు బుధవారం జరిగిన సమావేశంలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి ఏఆర్‌ఓలు ఎప్పటికప్పుడు రిజిస్టర్ నిర్వహించాలని, అభ్యర్థులకు అనుమతులు మ్యానువల్‌గా ఇవ్వాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల లాగానే ఎఫ్ఎస్‌టీ బృందాలు కొనసాగుతాయని తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎన్నికల అధికారులు సర్ఫరాజ్ అహ్మద్, లోకేశ్ కుమార్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి, చండూరు ఏఆర్‌ఓ సుబ్రహ్మణ్యం, మిర్యాలగూడ ఏఆర్‌ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# అనుమతి లేని మెడిసిన్ సీజ్

## షాపు నిర్వాహకుడిపై క్రిమినల్ కేసు



సీజ్ చేసిన మెడిసిన్‌ను చూపుతున్న అధికారులు

లింగాలఘనపురం, మే 15 : ప్రభుత్వ అనుమతి లేని మెడిసిన్ సీజ్ చేసి మెడికల్ షాపు నిర్వాహకుడు రాకేశ్‌కుమార్‌పై ఔషధ నియంత్రణశాఖ అధికారులు బుధవారం క్రిమినల్ కేసు నమోదు చేశారు. అనుమతి లేని 49రకాల అలోపతి మందులను సీజ్ చేశారు. ఔషధ నియంత్రణశాఖ వరంగల్ సహాయ సంచాలకులు రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో బాలకృష్ణ, ఆనంద్‌కుమార్ తనిఖీ చేసి షాపులోని మందులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని జనగామ కోర్టులో హాజరుపరచినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధికారి పావని పాల్గొన్నారు.

*మామిడి విక్రయాల కోసం సరికొత్త మార్కెట్ అందుబాటులోకి వచ్చింది. బెంగళూరుకు చెందిన ఫ్రూటెక్స్ అనే కంపెనీ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జాతీయ రహదారి పక్కన దీనిని ఏర్పాటుచేసింది. ఈ సంస్థ రైతుల నుంచి మామిడి కాయలను సేకరించడమే గాక ఇతర రాష్ట్రాల కొనుగోలుదారులను ఇక్కడికి పిలిపించి నేరుగా వేలం పాట ద్వారా క్రయవిక్రయాలు చేస్తోంది. లక్ష లోపు ఖరీదుకు కేవలం 5 నిమిషాల్లోనే, అంతకుమించితే కొన్ని గంటల వ్యవధిలోనే రైతుల బ్యాంకు ఖాతాలో నగదు జమచేయడం, ట్రేడర్ కమీషన్ కూడా తక్కువ తీసుకోవడం, రవాణా ఖర్చు ఆదా అవుతుండడంతో ఎక్కువ మంది రైతులు ఈ మార్కెట్‌కు బారులు తీరుతున్నారు. రైతులకు దళారీ బెడద లేకుండా ఇక్కడ కొనుగోలు చేసిన మామిడిని నాణ్యత బట్టి గ్రేడింగ్ చేసి డిమాండ్ ఉన్న ఢిల్లీ, రాజస్థాన్, తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుండగా, ఈ ఏడాది వెయ్యి టన్నులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు మార్కెట్ ఇన్‌చార్జి చెబుతున్నారు.*

**- హనుమకొండ సబర్బన్, మే 15**

● ఎల్కతుర్తి టూ ఢిల్లీ



మామిడి కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



# మామిడికి సరికొత్త మార్కెట్

## ఎల్కతుర్తిలో ఏర్పాటుచేసిన ప్రైవేట్ సంస్థ

- భారీగా తరలివస్తున్న రైతులు
- నేరుగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- ట్రేడర్ కమీషన్లూ తక్కువే
- రవాణా ఖర్చు రైతులకు ఆదా



మిషన్ ద్వారా గ్రేడింగ్

ఈసారి ప్రతికూల వాతావరణం కారణంగా మామిడి దిగుబడి తగ్గినప్పటికీ ఉన్నంతలో కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ముఖ్యంగా హనుమకొండ, జనగామ, వరంగల్ హుస్నాబాద్, సిద్దిపేట జిల్లాల్లో భారీ ఎత్తున తోటలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలోనే 5200 ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా వీటి ద్వారా ఈసారి 10వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని ఉద్యానవన శాఖ అంచనా వేస్తోంది. ఈ మామిడి కాయలను రైతులు వరంగల్‌లో విక్రయించేందుకు తీసుకొస్తుంటారు. దీంతో నిత్యం మామిడికాయల లోడ్‌తో భారీ ఎత్తున వాహనాలు బారులు తీరుతున్నాయి. అయితే వరంగల్ మార్కెట్‌కు వెళ్తే వేలం పాట తర్వాత రైతు వాహనం నుంచి కాయలను దిగుమతి చేసిన తర్వాత నాణ్యత పేరుతో ధరలను భారీగా తగ్గించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈక్రమంలో ఎల్కతుర్తిలో మార్కెట్ ఏర్పాటు కావడంతో ఎక్కువ మంది ఇటువైపు మొగ్గుచూపుతున్నారు. నిన్న, మొన్నటివరకు వరంగల్ మార్కెట్‌లో మామిడికి తక్కువ ధర ఉండగా, ఈ ఫ్రూటెక్స్ మార్కెట్ ఏర్పాటైన తర్వాత భారీగా పెరిగిందని రైతులు సంతోషంగా చెప్తున్నారు.

### దళారుల ప్రమేయం లేకుండానే..

ఫ్రూటెక్స్ మార్కెట్‌లో ఒక్కసారి వేలం పాట పూర్తయితే అదే ధరతో క్వాలిటీకి సంబంధం లేకుండా కాయలను దిగుమతి చేసుకుంటారు. అక్కడే ఉండే కూలీలు కాయ నాణ్యతను బట్టి ఏబీసీడీలుగా గ్రేడింగ్ చేసి సెపరేట్‌గా ప్యాకింగ్ చేస్తారు. పగిలిన కాయలను సైతం వేరుచేసి జ్యూస్‌లు, ఐస్‌క్రీమ్‌ల తయారీ సంస్థలకు సరఫరా చేస్తారు. రైతు తన మామిడికాయల లోడ్ ఎప్పుడు పంపిస్తాడో సమాచారం ఇస్తే చాలు ఆ రైతు పేరిట స్లాట్‌ను బుక్ చేస్తారు. వాహనం చేరుకున్నది మొదలు దాని కాయ ధర, పేమెంట్ వివరాలను ఎప్పటికప్పుడు రైతు ఫోన్‌కు సమాచారం అందిస్తారు. నలుగురు ఐఐటీ విద్యార్థులు కలిసి నెలకొల్పిన ఈ ఫ్రూటెక్స్ సంస్థ కేవలం మామిడి కాయలే కాకుండా ఇతర పండ్లను కూడా సేకరించి దేశవ్యాప్తంగా డిమాండ్ ఉన్న రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం ఎల్కతుర్తిలో ఏర్పాటుచేసిన మార్కెట్ ద్వారా మధ్యప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రకు మామిడి కాయల లోడింగ్ చేసి వాహనాలను పంపిస్తున్నారు. ఈ ఏడాది ఎల్కతుర్తి మార్కెట్ ద్వారా వెయ్యి టన్నుల ఎగుమతి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కంపనీ ప్రతినిధులు చెప్తున్నారు. ఎల్కతుర్తి సమీపంలో ఉండే హసన్‌పర్తిలో మామిడికి సంబంధించి 50మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. వీరంతా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వందల ఎకరాల్లో కౌలు తీసుకొని మామిడి తోటలను సాగు చేస్తున్నారు. అక్కడినుంచి నేరుగా ఈ ఫ్రూటెక్స్ మార్కెట్‌లో విక్రయానికి తీసుకొస్తున్నారు.



మామిడి కాయలను లోడింగ్ చేస్తున్న కూలీలు

### రైతుల మేలు కోసమే



రైతులకు మేలు చేయాలన్నదే మా కంపెనీ లక్ష్యం. అందుబాటులో మార్కెట్లను ఏర్పాటు చేసి మామిడి కాయలను సేకరించి వినియోగదారులకు కూడా కోతలు పూర్తయిన తక్కువ సమయంలో తాజాగా అందిస్తున్నాం. క్రయవిక్రయాలు అయిపోయిన తర్వాత గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమవుతుంది. మార్కెట్‌ను విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

**– రాజేంద్రకుమార్, ఫ్రూటెక్స్ మార్కెట్ ఇన్‌చార్జి**

### రవాణా ఖర్చు తగ్గుతుంది



ఇక్కడ ఏర్పాటుచేసిన మామిడి కాయల విక్రయాల మార్కెట్ ద్వారా దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా కాయలు అమ్ముకోవడం సులభమవుతుంది. మాకు రవాణా ఖర్చు కూడా తగ్గుతుంది. నా మామిడి తోటలో నుంచి కూలీల ద్వారా మామిడి కాయలను కోయించి డైరెక్టుగా తీసుకొచ్చాను. వేలం పాట కూడా పూర్తయింది. ఇదివరకు గంటల తరబడి మార్కెట్‌లో వేలం పాట కోసం ఎదురుచూడాల్సి వచ్చేది.

**– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, ఎల్లాపూర్, హనుమకొండ**

### రోజూ పని దొరుకుతున్నది



ఇక్కడ మార్కెట్ పెట్టినప్పటి నుంచి రోజూ 50 మంది కూలీలకు పని దొరుకుతోంది. మాకు గంటకు రూ.100 చొప్పున కట్టిస్తున్నారు. మార్కెట్ అయిపోయేదాకా మమ్మల్ని రోజూ రమ్మని చెప్పారు. ప్రస్తుతం పనులు లేని సమయంలో ఎల్కతుర్తికి మార్కెట్ రావడం సంతోషంగా ఉంది. నాలుగైదు గ్రామాల యువకులకు ఇక్కడ మూడు షిఫ్టులుగా పనికి వస్తున్నాం. ఈ కంపెనీ వారు కూడా మమ్మల్ని బాగా చూసుకుంటున్నారు.

**– చిలుముల వినోద్, కూలీ**

## అంగన్‌వాడీ టీచర్ హత్య



సుజాత(ఫైల్)

తాడ్వాయి, మే 15 : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కాటాపురం అంగన్‌వాడీ సెంటర్-3లో టీచర్‌గా పని చేస్తున్న రడం సుజాత(48) హత్యకు గురైంది. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి చెందిన సుజాత కాటాపురం అంగన్‌వాడీ సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్నది. మంగళవారం స్వగ్రామం నుంచి కాటాపురానికి చేరుకున్న సుజాత విధులు ముగించుకొని మధ్యాహ్నం 1:30 గంటలకు ఇంటికి వెళ్లేందుకు బయటకు వెళ్లింది. బస్సు మిస్ కావడంతో గుర్తు తెలియని వాహనం ఎక్కింది. బుధవారం ఉదయం కాటాపూర్-తాడ్వాయి రహదారి మధ్యలో నీళ్ల ఒర్రెకు అర కిలోమీటర్ దూరంలో తునికాకు కోసేందుకు వెళ్లిన కూలీలకు సుజాత మృతదేహం కనిపించింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, పస్రా సీఐ శంకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్‌ను తీసుకువచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి మెడకు స్కార్ఫ్ చుట్టి ఉండటంతో పాటు తల వెనుక పెద్ద గాయమైంది. మృతురాలి కుమారుడు చరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పంచనామా అనంతరం ములుగు ప్రభుత్వ దవాఖానకు మృతదేహాన్ని తరలించారు. మృతురాలి ఒంటిపై ఉన్న నాలుగు తులాల బంగారంతో పాటు సెల్ ఫోన్ చోరీకి గురైనట్లు తెలిపారు. కాగా, కాటాపురంలో ఎవరి వాహనం ఎక్కి వెళ్లిందనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# అమ్ముకోవడమూ కష్టమే..

- కేసముద్రం మార్కెట్‌లో రైతుల ఆవేదన
- వేరుశనగను కొనుగోలు చేయని వ్యాపారులు
- ఇళ్లకు తీసుకెళ్లిన ఇద్దరు రైతులు




వేరుశనగను ఇంటికి తీసుకెళ్తున్న రైతు



విక్రయానికి వచ్చిన వేరుశనగ

కేసముద్రం, మే 15: ఆరుగాలం కష్టపడి పండించిన రైతులు పంటను అమ్ముకోవడం కూడా కష్టంగా మారింది. ఇప్పటికే ధరల హెచ్చుతగ్గులతో తీవ్రంగా నష్టపోతుండగా, పంటను అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. మిల్లుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో కేసముద్రం మార్కెట్‌కు వేరుశనగను తరలించిన రైతులు కొనుగోలు చేయాలని ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారులను ప్రాధేయపడినా ఎవరూ ముందుకు రాలేదు. మండలంలోని పెనుగొండకు చెందిన ముదిగిరి కుమారస్వామి 15బస్తాలు, మరో రైతు సుధాకర్ 15బస్తాల వేరుశనగను కేసముద్రం మార్కెట్‌కు బుధవారం విక్రయించేందుకు తీసుకువచ్చి రాసులు పోశారు. ఉదయం ఈ-నామ్ ద్వారా వ్యాపారులు టెండర్ వేయగా అధికారులు మధ్యాహ్నం టెండర్ విడుదల చేశారు. టెండర్‌లో వేరుశనగను ఏ వ్యాపారి ఖరీదు చేయలేదు. దీంతో రైతులు మార్కెట్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు ఫిర్యాదు చేయగా వ్యాపారులను అడగాలని సూచించారు. రైతులు మిల్లుల వద్దకు వెళ్లి వేరుశనగను కొనుగోలు చేయాలని కోరగా కొందరు నిరాకరించారు. మరికొందరు క్వింటాల్‌కి రూ.4వేల చొప్పున ఖరీదు చేస్తామని చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చూసి ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో చేసేదేమీ లేక వేరుశనగను రైతులు మళ్లీ బస్తాల్లో నింపుకొని ఇళ్లకు తీసుకెళ్లారు.

### అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలే..



పంట పండించడం ఒక ఎత్తయితే పంట అమ్ముకోవడం మరో ఎత్తవుతున్నది. మార్కెట్‌లో వేరుశనగను ఎవరూ ఖరీదు చేయకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. మిల్లుల వద్దకు వెళ్లి అడిగితే తక్కువ ధరకు కొంటామంటున్నరు. ఎకరానికి 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి రావాల్సి ఉండగా, 5 క్వింటాళ్లే వచ్చింది. దిగుబడి తగ్గి నష్టపోగా, ధర కూడా లేకపోవడం, వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో సాగుచేయడం భారంగా మారుతోంది. మద్దతు ధర లేక, పెట్టిన పెట్టుబడి రాక ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. మద్దతు ధర చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైంది.

**– ముదిగిరి కుమారస్వామి, పెనుగొండ రైతు**

# నేల చల్లబడ్డాక సాగు చేయండి

- తొలకరి చినుకుకే నాటి నష్టపోవద్దు
- రెండు మూడు వర్షాలు పడే వరకు ఆగండి
- రైతు అవగాహన సదస్సులో ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, మే 15: రెండు మూడు వర్షాలు పడి నేల చల్లబడ్డాక సాగుకు ఉపక్రమించాలని, తొలకరి చినుకులకే విత్తనాలు నాటి నష్టపోవద్దని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఉపసంచాలకులు(ఏడీఆర్) డాక్టర్ మల్లారెడ్డి రైతులకు సూచించారు. రైతులు తమ సమీపంలో ఉన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహా తీసుకొని సాగుకు ఉపక్రమించాలని చెప్పారు. సమతుల వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు బుధవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సదస్సు జరిగింది. మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు సూచనలు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సమతుల్య సాగు అవసరమని తెలిపారు. నీటి సాంకేతికతకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలు తీసుకోవాలని చెప్పారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను కొనుక్కునేటప్పుడు అధికారులతో సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అర్హత గల డీలర్‌తో లేదా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులతో కొనుగోలు చేయాలని చెప్పారు. తప్పనిసరిగా రసీదు పొంది పంట చివరి వరకు భద్రంగా దాచుకోవాలని సూచించారు. మూస పద్ధతిన సాగు చేస్తే అపార నష్టాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు ప్రేమ్ సింగ్, శేఖర్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం సంచాలకులు అనిల్ ఉద్యాన పంటలు కూరగాయలు, పూల తోటల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# కేఎఫ్ లైట్ బీర్‌లో నీళ్లు..!

- నాసిరకం బీర్లు అమ్ముతున్నారని మద్యంప్రియుడి ఆవేదన
- ఎక్సైజ్ అధికారులకు వినియోగదారుడి ఫిర్యాదు



ఎక్సైజ్ అధికారులకు అందజేసిన బీరు బాటిల్

ములుగురూరల్, మే 15 : కేఎఫ్ లైట్ బీర్లలో నీళ్లున్నాయంటూ ఓ వినియోగదారుడు ఎక్సైజ్ అధికారికి ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న ములుగు మండలం మల్లంపల్లిలోని మహంకాళి వైన్స్‌లో అదే గ్రామానికి ఓ యువకుడు ఆరు బీర్లు కొనుగోలు చేశాడు. వాటిలో ఐదు బీర్లను ఓపెన్ చేయగా ఆల్కాహాల్‌కు బదులు నీళ్లున్నట్లు గుర్తించి ఖంగుతిన్నాడు. నాసిరకంగా ఉందని భావించి అదే బ్యాచ్ నంబర్ కలిగిన ఆరో బీర్ బాటిల్‌ను ఎక్సైజ్ అధికారులకు అందించి నాసిరకం బీర్ల విక్రయాలు జరుపుతున్నారని బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈమేరకు సదరు బీర్ బాటిల్‌ను నాణ్యత పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపిస్తామని, లోపం నిర్ధారణ అయితే సంబంధిత వైన్‌షాపు యాజమాన్యంతో పాటు బీరు తయారు చేసిన కంపెనీపై ఎక్సైజ్ శాఖ ద్వారా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారని యువకుడు తెలిపాడు.